క్లుప్తంగా

చిన్న కుటుంబాలతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.వెంకటరమణ

కర్నూలు(హాస్పిటల్): చిన్న కుటుంబాలతోనే అభివృద్ధి సాధ్యమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.వెంకటరమణ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గైనకాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పాటించాలన్నారు. ఎక్కువ మంది పిల్లలను కనడం వల్ల తల్లికి అనారోగ్యం కలుగుతుందని, ఎదిగే పిల్లలు ఆరోగ్యంగా ఉండరని చెప్పారు. కార్యక్రమంలో గైనకాలజిస్టులు డాక్టర్ సావిత్రి, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ సుధారాణి, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ రత్నకుమారి పాల్గొన్నారు.

సెట్కూరు ఆధ్వర్యంలో..

జిల్లా యువజన సర్వీసుల శాఖ(సెట్కూరు) ఆధ్వర్యంలో మంగళవారం బి.క్యాంపులోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా సెమినార్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ మాట్లాడుతూ జనాభా పెరుగుదల వల్ల ఆహార కొరతతో పాటు ఎన్నో సమస్యలు కలుగుతున్నాయన్నారు. అనంతరం వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో సెట్కూరు సీఈఓ పీవీ రమణ, మేనేజర్ సత్యనారాయణ, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గిరిజన వసతి గృహం ఏర్పాటు చేయండి

కర్నూలు(అర్బన్): కళాశాల విద్య అభ్యసిస్తున్న గిరిజన బాలికలకు నగరంలో గిరిజన వసతి గృహం ఏర్పాటు చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప కోరారు. మంగళవారం ఆయన విజయవాడలో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ రవీంద్ర బాబును కలిసి వినతి పత్రం అందించారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు కృష్ణమూర్తి ఉన్నారు.

నేడు గులాం రసూల్ ఖాన్ వర్ధంతి

కర్నూలు(కల్చరల్): కర్నూలు చివరి నవాబు గులాం రసూల్ ఖాన్ వర్ధంతిని బుధవారం నిర్వహించనున్నట్లు ఇంటలెక్చువల్ కలెక్టివ్ జిల్లా అధ్యక్షుడు ఎం. ఖదీరుల్లా, కార్యదర్శి ఇనాయతుల్లా మంగళవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్థానిక టీజీవీ కళా క్షేత్రంలో నిర్వహించనున్న వర్ధంతి సభకు కవులు, రచయితలు, చరిత్రకారులు, మేధావులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కార్మికుల పక్షాన ఉద్యమించిన ఈయూ



కొత్త బస్టాండ్‌లో జెండావిష్కరణ చేస్తున్న ఈయూ నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్): ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం ఉద్యమించిందని ఎంప్లాయీస్ యూనియన్ కర్నూలు జిల్లా కార్యదర్శి ఏవీ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణంలో సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం సంఘం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, కర్నూలు-1, 2 డిపోల కార్యదర్శులు ఆర్‌వీఎం రావు, మహేశ్వరరావు పాల్గొన్నారు.

రీసర్వే పకడ్బందీగా చేపట్టండి



సచివాలయాల సిబ్బందికి ట్యాబ్‌లు అందజేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

కర్నూలు (టౌన్): రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాక కౌన్సిల్ హాలులో నగరంలోని అన్ని సచివాలయాల సిబ్బందికి 5 కంప్యూటర్లు, 130 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే డ్రోన్ సర్వే విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం రూపొందించిన యాప్ ప్రకారం సచివాలయాల సిబ్బంది సర్వే నంబర్ల హద్దులు, ఖాళీ స్థలాల గుర్తింపు, వివాదాలకు అవకాశం లేకుండా త్వరితగతిన సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, సహాయ సిటీ ప్లానర్లు హాయత్, రంగస్వామి, దామోదర్, సుబ్బన్న, రాముడు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు రక్ష.. జగనన్న సురక్ష

- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): పేదవారికి రక్ష జగనన్న రక్ష అని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం స్థానిక నగరంలోని 2, 7, 18, 49 వార్డుల్లోని 5, 18, 44, 125 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఇప్పటికే 95 శాతం హామీలు నెరవేర్చినట్లు చెప్పారు. వందకు వంద శాతం అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే నెలరోజుల పాటు జగనన్న సురక్ష సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే సదస్సుల దృష్టికి తీసుకు వస్తే పరిశీలించి పథకాలకు అర్హులను చేస్తామన్నారు. సదస్సులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయా సచివాలయాల పరిధిలో కుల, నివాస, ఆదాయ, మరణ తదితర ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఈఈ శేషాసాయి, కార్పొరేటర్లు జుబేర్ అహమ్మద్, పల్లవి, క్రిష్ణకాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

కర్నూలు(రాజ్‌విహార్): గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే సంక్షేమ పథకాలు అందేవని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక 12వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వడ్డెగేరిలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేసి, ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించిన పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకం అందాలంటే కమిటీలకు చేతులు తడపాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆ పరిస్థితి లేదన్నారు. వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు, చేకూరే లబ్ధి, ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం వివరించే దరఖాస్తు చేస్తున్నారని వెల్లడించారు. వచ్చిన దరఖాస్తుల్లో అర్హతే ప్రమాణికంగా పరిగణలోకి తీసుకొని మంజూరు చేస్తుండడంతో ఎవరి సిఫార్సులకు తావు లేదని చెప్పారు. ఇలాంటి పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. పథకాల కోసం ఎవరి వద్దకే వెళ్లాల్సిన పని లేదని, ఎవరికీ డబ్బు ఇచ్చుకోవాల్సిన అవసరం లేదనే విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు నవీన్, హనీఫ్, షేక్షా, శ్రీను కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్





సూర్యనారాయణ స్వామి ఆలయంలో శాకాంబరిగా మహాగౌరి, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నమోస్తుతే.. శాకాంబరీ

కర్నూలు కల్చరల్: నగరంలోని సూర్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలోని మహా గౌరి అమ్మవారికి ఆషాడ మాసం నవమి అశ్విని నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

- బండిమెట్ట అంబా భవాని మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలను ఎద్దుల బండిపై నగర వీధుల్లో ఊరేగించారు.
- బండి మెట్ట గంగా భవానీ సమేత కేదారేశ్వర స్వామి ఆలయంలో ఆషాడ మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి దర్శనం కల్పించారు. బండిమెట్ట, పూల బజార్ ప్రాంతాల్లో బోనాలతో మహిళలు శోభా యాత్ర నిర్వహించారు.
- కందేరిలోని సుంకులా పరమేశ్వరి మాత ఆలయంలో బోనాల ఉత్సవం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎస్వీ విజయ మనోహరి దంపతులు పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీకృష్ణుడే జగద్గురువు

కర్నూలు కల్చరల్: ఆషాడమాసం గురుపౌర్ణమిని పుష్కరించుకుని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని డాక్టర్స్ కాలనీ, శరీన్ నగర్‌లలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. గురు పౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడే అని సేవా సమితి సభ్యులు నాగయ్య అన్నారు. శ్రీకృష్ణుడే జగద్గురువు అన్నారు. గురు పౌర్ణమి రోజున శ్రీకృష్ణ పరమాత్మతనే గురువుగా పూజించాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు కల్యాణ్, వాసు, వెంకటేష్, జగన్, రాజేశ్వరి, మధు, వాణి, దివ్య, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యులు

విశ్రాంత కలెక్టర్ అభినందనలు

కర్నూలు కల్చరల్: ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకుని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించిన నందమూరి తారక రామారావు సినిమాలకు సంబంధించి 101 పాటలకు నృత్య ప్రదర్శన చేసి రికార్డు సృష్టించిన నిర్వాహకులు పత్తి ఓబులయ్య, కన్వీనర్ కరీముల్లాను మంగళవారం విశ్రాంత కలెక్టర్ గుమ్మల్ల బలరామయ్య సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నృత్య రూపకంలో కర్నూలు కళాకారులు చేరడం అభినందనీయమన్నారు. రికార్డు నృత్య ప్రదర్శన చేసి కళాకారులు తమ అభినయాన్ని ప్రదర్శించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు బాలవెంకటేశ్వర్లు, నృత్య కళాకారిణి విజయలక్ష్మి పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.నిర్మల డిమాండ్‌చేశారు. 30 ఏళ్లకుపైగా పనిచేసి పదవీ విరమణ పొందితే ఎలాంటి బెనిఫిట్స్ లేకపోతే వారి జీవనం ఎలా సాగుతుందని ప్రశ్నించారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా రెండో రోజు కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

650 గ్రాముల గంజాయి సీజ్

కర్నూలు: నగర శివారులోని రోజా వీధి చివర రైల్వే హంద్రీ బ్రిడ్జి కింద కొంతమంది యువకులు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం అందడంతో రెండో పట్టణ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పాతబస్తీకి చెందిన ఐదుగురు యువకులు హంద్రీ బ్రిడ్జి కిందకు చేరి గంజాయి సేవిస్తుండగా వారి వద్ద తనిఖీలు నిర్వహించగా ఒక్కొక్కరి వద్ద 100 నుంచి 150 గ్రాముల దాకా గంజాయి పొట్లాలు ఉన్నాయి. వారి నుంచి 650 గ్రాముల గంజాయి సీజ్ చేసి, యువకులను స్టేషన్‌కు తీసుకెళ్లి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. చదువులకు స్వస్తి చెప్పి వ్యసనాలకు బానిసలైతే జీవితం అంధకారమవుతుందని సీఐ శ్రీనివాసులు వారిని హెచ్చరించారు. నిందితులను కోర్టులో హాజరుపరుచగా రిమాండ్‌కు ఆదేశించారని తెలిపారు.

ఇద్దరు మహిళలు అదృశ్యం

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని మహిళా ప్రాంగణంలో ఉన్న స్వధార్ హోమ్ శక్తి సదన్‌లో ఉంటున్న ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. వీరిలో చిన్నప్పటి నుంచి మద్రాసులో పెరిగిన ఎస్.డి.సయ్యద్ జుహ ఫాతిమా (19), మంత్రాలయం మండలం మాధవరం తండాకు చెందిన సుగాలి పార్వతి బాయి (20) ఉన్నారు. వీరిద్దరూ కొంతకాలంగా స్వధార్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్నారు. సోమవారం రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య మహిళా ప్రాంగణం బాత్‌రూమ్ గోడ దూకి పారిపోయినట్లు నైట్ వాచ్ ఉమెన్ ద్వారా ప్రాంగణం మేనేజర్ సమాచారం అందుకున్నారు. వారి కోసం చుట్టుపక్కల గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మహిళల పాత్ర పెరగాలి



వనం లక్ష్మికి కండువా కప్పి బాధ్యతలు అప్పగిస్తున్న శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న బీసీ సంక్షేమ సంఘంలో మహిళల పాత్ర పెరగాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు కోరారు. మంగళవారం స్థానిక క్రిష్ణకాంత్ ప్లాజాలోని కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సంఘం జోన్ డివిజన్ కన్వీనర్‌గా వనం లక్ష్మిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న బీసీలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. బీసీలు అన్ని రంగాల్లో రాణించాలంటే ముందుగా విద్యకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అన్వర్‌హుసేన్, ప్రచార కార్యదర్శి బాలసంజన్న, మహిళా నాయకురాళ్లు సునీత, శ్రావణి, రాజేశ్వరి, సుజాత, శివకుమారి, మహేశ్వరి, రాధ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరంపై ఐకానిక్ బ్రిడ్జిని అడ్డుకుంటాం

- రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర రెడ్డి

కర్నూలు కల్చరల్: సిద్ధేశ్వరంపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణాన్ని అడ్డుకుంటామని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డి హెచ్చరించారు. సిద్ధేశ్వరం వద్ద తీగల వంతెనకు బదులుగా బ్రిడ్జి కమ్ బ్యారేజ్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం వద్ద కృష్ణా నదిపై తీగల వంతెన నిర్మాణానికి ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని భారతీయ జనతా పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాయలసీమ డిక్లరేషన్‌లో తీగల వంతెన ప్రస్తావన లేదన్నారు. సిద్ధేశ్వరం అలుగు మాత్రమే ఉందన్నారు. సిద్ధేశ్వరం అలుగును టెక్నికల్‌గా బ్రిడ్జికమ్ బ్యారేజ్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. రాయలసీమ సమస్యల సాధనకు ఈనెల 28న చేపట్టే చలో ఢిల్లీకి రాయలసీమ జిల్లాల నుంచి ప్రజలు తరలి రావాలని కోరారు. అనంతరం జాతీయ రహదారుల విభాగం అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు సీమ కృష్ణ, శ్రీధర్, నవీన్, సురేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

కర్నూలు (న్యూసిటీ): ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 69 మందిని ఉద్యోగాలు వరించాయి. డెస్టినీ టెక్ సర్వీస్ ఆధ్వర్యంలో ఐదు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించి తమకు కావాల్సిన వారిని ఎంపిక చేసుకున్నారని వీసీ ప్రొఫెసర్ ఆనందరావు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ షేక్ మహమ్మద్ జక్రియా, కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌లో ముళ్ల కంచెను వేసిన దృశ్యం



‘చెత్త’శుద్ధి కెనాల్‌లో..



చెత్త దిబ్బను తలపిస్తున్న కేసీ కెనాల్

వేలాది ఎకరాలకు సాగునీటిని అందించే కేసీ కెనాల్ నిర్వహణ పట్ల జలవనరుల శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. కేసీ కెనాల్ తీరంలో నివసించే ప్రజలు చెత్తాచెదారాన్ని అందులో పడేస్తుండటంతో కెనాల్‌లో అడుగడుగునా మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. వీటి వల్ల మురుగు నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. మరోవైపు కేసీ కెనాల్ ప్రాంతమంతా దుర్గంధం నెలకొంది. నెల రోజుల క్రితం 7 కి.మీ పొడవున్న కేసీ కెనాల్‌లో చెత్తాచెదారం తొలగించేందుకు చర్యలు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని కెనాల్‌లో చెత్తాచెదారాన్ని తొలగించాలని నగరవాసులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

రెండేళ్ల బాబుతో..

షేక్ రేష్మా బేగం 15వ వార్డులో వలంటీర్‌గా పనిచేస్తోంది. రెండేళ్ల కుమారుడిని చంకనెత్తుకుని ఉదయమే బయలుదేరుతుంది. తనకు కేటాయించిన 50 ఇళ్లనూ రోజూ సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకుంటుంది. సంక్షేమ పథకాలు వివరించి అర్హులతో దరఖాస్తు చేయిస్తోంది. ఇక ప్రతి నెలా 1వ తేదీ ఉదయం 6 గంటలకే ఇంటింటికి తన పరిధిలోని పెన్షన్‌దారులకు పింఛన్ సొమ్ము అందిస్తోంది. ‘నాకు జీతం కన్నా సేవ ముఖ్యమన్న భావన మొదటి నుంచి ఉండేది. వలంటీర్‌గా అవకాశం రావడంతో పేదలకు సేవలు అందిస్తూ జీవనం గడుపుతున్నా’ అంటున్న షేక్ రేష్మాను పలువురు అభినందిస్తున్నారు.



వితంతువుతో తంబ్ వేయిస్తున్న వలంటీర్ షేక్ రేష్మా

పొద్దున్నే ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తోంది

పిల్లల మీద ఆధార పడే నాకు నాలుగేళ్ల క్రితం వితంతు పెన్షన్ మంజూరైంది. అప్పటి నుంచి ప్రతి నెలా మొదటి రోజే రేష్మా వచ్చి నాకు పెన్షన్ డబ్బు ఇస్తోంది. ఏనాడూ పెన్షన్ కోసం ఎదురు చూడలేదు. చిన్నపిల్లోడిని ఎత్తుకుని పొద్దున్నే వచ్చి పలకరించి పెన్షన్ ఇస్తుండం సంతోషంగా ఉంది.

– మైమూన్, వితంతు పెన్షన్‌దారు

వలంటీర్ల సేవలు కన్పించడం లేదా

- అవాకులు చెవాకుల పేలితే పుట్టగతులుండవ్
- డిప్యూటీ మేయర్ రేణుక

కల్లూరు: వలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవలు కన్పించడం లేదా అని కర్నూలు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ రేణుక ప్రశ్నించారు. నిస్వార్థ సేవలు అందిస్తున్న వలంటీర్లపై అవాకులు చెవాకులు పేలితే పుట్టగతులుండవని పవన్ కళ్యాణ్‌ను హెచ్చరించారు. ఏలూరు సభలో వలంటీర్లపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో వలంటీర్లు ధర్నా చేశారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మకు చెప్పుల దండ వేసి ఊరేగించారు. అనంతరం దహనం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ వలంటీర్లకు వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలన్నారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా సేవా దృక్పథంతో సంక్షేమ పథకాలను అర్హులకు అందజేస్తున్నామన్నారు. కరోనా కష్ట కాలంలో సైతం ఇంటింటికి వెళ్లి సేవలందించామన్నారు. ఇవేవీ తెలుసుకోకుండా వలంటీర్ వ్యవస్థపైనే నిరాధార ఆరోపణలు చేయడం పవన్ కల్యాణ్‌కు తగదని హితవు పలికారు. క్షమాపణలు చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ధర్నాలో పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

లాప్రోస్కోపిక్ పద్ధతిలో కిడ్నీ సేకరణ



వివరాలు తెలుపుతున్న డాక్టర్ మనోజ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): రాయలసీమలోనే తొలిసారిగా ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో దాత నుంచి కిడ్నీ సేకరించి గ్రహీతకు అమర్చారు. వివరాలను కర్నూలు కిమ్స్ హాస్పిటల్ యురాలజిస్టు డాక్టర్ మనోజ్‌కుమార్ తెలిపారు. ‘శస్త్రచికిత్స చేసి చేత్తో కిడ్నీ తీయడం చాలా కాలంగా ఉంది. దీనివల్ల శస్త్రచికిత్స తర్వాత దాతకు విపరీతమైన నొప్పి ఉంటుంది. కత్తిరించిన కండరాలను కుట్టాలి. ఆ గాయాలు తగ్గడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఈ సమస్యలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని భర్తకు కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చిన భార్యకు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో కిడ్నీ సేకరించాలని నిర్ణయించాం. కర్నూలు జిల్లాకు చెందిన 40 ఏళ్ల వ్యక్తి చాలా కాలంగా మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్నారు. ఆయనకు తన మూత్రపిండాల్లో ఒకటి ఇచ్చేందుకు ఆయన భార్య ముందుకొచ్చారు. అన్నీ సరిపోవడంతో ఆమెకు ఇబ్బంది లేకుండా ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో కిడ్నీ తీయాలని నిర్ణయించాం. ఈ పద్ధతిలో ఎక్కడా పక్కటెముకలను, కండరాలను కత్తిరించాల్సిన అవసరం ఉండదు. కేవలం ఫేషియా అనే ఒక పొరను మాత్రం కత్తిరించి మూత్రపిండానికి ఎలాంటి గాయం కాకుండా అత్యంత జాగ్రత్తగా సేకరిస్తాం. ఇలా చేయడంతో దాత రెండు రోజుల్లో లేచి తిరిగి మూడో రోజు డిశ్చార్జ్ కూడా అయ్యారు. శస్త్రచికిత్సలో డాక్టర్ ఉమామహేశ్వరరావు, అనెస్తీషియా డాక్టర్లు శృతి, భువనేశ్వరి, నెఫ్రాలజిస్టు డాక్టర్ అనంత రావు పాల్గొన్నారు.’’

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధులపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య సూచించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో హెల్త్ ఎడ్యుకేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగ సమానత్వం కోసం హెల్త్ ఎడ్యుకేటర్లు వారి పరిధిలో మహిళా పోలీస్, అంగన్‌వాడీ సిబ్బంది సహకారంతో సరైన వివాహ వయస్సు, స్త్రీల అక్షరాస్యత, పీసీ పీఎన్‌డీటీ యాక్ట్, తాత్కాలిక, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులు, ప్రస్తుత పరిస్థితుల్లో సీజనల్ వ్యాధులు, వ్యాధినిరోధక టీకాల ప్రాముఖ్యత, పోషకాహార ఆవశ్యకతపై ప్రజలకు, మహిళా సంఘాల సభ్యులకు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాలకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమయానుసారంగా శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలో డెమో ప్రమీలాదేవి, హెచ్ఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాండ్రపాడు పీహెచ్‌సీ తనిఖీ

నగర శివారులోని బి.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య తనిఖీ చేశారు. అక్కడి రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి రక్తహీనత ఉన్న చిన్నారులకు ఐరన్ మాత్రలు, ఐరన్ సిరప్ అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి, ఆశాలు, ఏఎన్ఎంలకు సూచించారు. ఆయన వెంట ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత, వైద్యాధికారి ఉన్నారు.